



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 05-11-2023 సంపుటి : 06 సంచిక : 61 పేజీలు : 8 వెల : రూ 3-00



# ఏపీలో ఎన్నికల కసరత్తు షురూ...

## జనం నాడి తెలియక కన్ఫ్యూజన్‌లో పార్టీలు..!

అమరావతి,నవంబర్4 : ఆంధ్రప్రదేశ్ లో సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఐదు నెలలు సమయం ఉండగానే రాజకీయ వేడి ఊపందుకుంది. అన్ని పార్టీలు ఎవరికి వారు ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు.ఆయా పార్టీల అధ్యక్షులు కీలక నిర్ణయాలు తీసుకుంటూ నాయకులకు, కేడర్ కు దిశా నిర్దేశం చేస్తున్నారు. సెప్టెంబర్ 9 వ తేదీన అరెస్టు అయ్యే నాటి వరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పలు కార్యక్రమాలతో జనం బాట పట్టారు. ఇక ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా యువగళం పేరుతో ప్రజల్లోనే ఉండేవారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా వారాహి విజయయాత్రలతో గత జూన్ నుంచి ప్రజల్లోకి వెళ్తున్నారు. అటు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ నేతలను ఏడాదిన్నర ముందు నుంచే ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలు రూపొందించుకుని ముందుకు వెళ్తోంది. ఎన్నికలు ఏ సమయంలో జరిగినా తాము సిద్ధమే అంటూ అన్ని పార్టీలు ఎన్నికల సమరోత్సాహాన్ని ప్రదర్శించాయి.ప్రజలు తమ వైపే ఉన్నారని అధికార, విపక్షాలు ఎవరి వాదన వారు చెప్తుంటే అసలు ప్రజలు ఎవరికి పట్టం కడతారనే దానిపై ఇంకా పూర్తి స్పష్టత రావడం లేదు. ఎవరి సర్వేలు వారు చేయించుకుంటున్నారు. ప్రయివేట్ సంస్థల ద్వారా,పార్టీలోని వ్యక్తుల ద్వారా కూడా అన్ని పార్టీలు క్షేత్ర స్థాయి పరిస్థితులపై నివేదికలు తెప్పించుకుంటున్నాయి. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా అన్ని పార్టీలు అభ్యర్థుల గురించి అభిప్రాయాలు ఇప్పటికే సేకరించాయి. ఇలా ఎన్నికలకు పూర్తి సన్నద్ధమవుతూ గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. ఆయా పార్టీల సభలకు జనం భారీగా తరలివస్తుండటంతో ఎవరికి వారే తమ గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఇప్పుడు సభలకు జనాలు భారీగా వస్తే గెలిచేసినట్లేనా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలయ్యింది.రాష్ట్రంలో ఆ పార్టీ ఈ పార్టీ అని తేడా లేకుండా అన్ని పార్టీల సభలకు జనం భారీగా తరలివస్తున్నారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల సభలకూ అనూహ్య స్పందన వస్తుంది. జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ వారాహి విజయయాత్రలకు భారీ స్థాయిలో జనం వస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో పాటు సాధారణ జనం కూడా స్వచ్ఛందంగా తరలి వస్తున్నారంటూ జనసేన నాయకులు చెప్పుకొస్తున్నారు. పవన్ కళ్యాణ్ పట్ల, జనసేన పట్ల ప్రజల్లో ఆదరణ బాగా పెరిగిందనడానికి ఇది సంకేతమని ధీమా వ్యక్తంచేస్తున్నారు. దీంతో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తమ విజయావకాశాలను లెక్కలు వేసుకుంటున్నారు. ఇక తెలుగుదేశం పార్టీ కూడా చంద్రబాబు అరెస్ట్ కు ముందు, చంద్రబాబు విడుదల సమయంలో వచ్చిన జన స్పందనతో కొత్త అంచనాలు వేసుకుంటుంది. చంద్రబాబు అరెస్ట్ కు ముందు జరిగిన రోడ్ షోలు,బహిరంగ సభలకు భారీగా జనం తరలివచ్చేవారు?ప్రజల్లో ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకతతోనే జనం భారీగా తరలివస్తున్నారని?ఇది టీడీపీ విజయానికి సంకేతం అంటూ చెప్పుకొచ్చారు. మరోవైపు చంద్రబాబు రాజమండ్రి జైలు నుంచి విడుదలై విజయవాడకు తిరిగి వచ్చే సమయంలో జాతీయరహదారిలో చాలాచోట్ల అర్ధరాత్రి సమయంలో కూడా ప్రజలు వేచిఉండటాన్ని మరింత అనుకూలంగా మలుచుకుంది తెలుగుదేశం పార్టీ. చంద్రబాబు నాయుడి అరెస్టుతో ప్రజల్లో సానుభూతి బాగా పెరిగిందని, దీని ప్రభావం వచ్చే ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని ఆ పార్టీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. ఇక వైఎస్సార్ సీపీ కూడా ఇదే ఫార్ములాను తనకూ వర్తించుకుని.. విజయంపై ధీమా వ్యక్తంచేస్తోంది. సామాజిక సాధికార బస్సు యాత్రలతో ఒక్కో నియోజకవర్గంలో జరుగుతున్న బహిరంగ సభలకు జనం పోటెత్తుతున్నారని, కేవలం బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలే పాల్గొంటున్నప్పటికీ ఇంత పెద్ద ఎత్తున జనం తరలిరావడం వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తుందనటానికి సంకేతాలని ఆ పార్టీ నేతలు చెప్పుకొంటున్నారు. ఇలా మూడు ప్రధాన పార్టీలు ఎలాంటి కార్యక్రమం నిర్వహించినా పెద్ద ఎత్తున జనం వస్తుండటంతో అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి వస్తుంది. మొత్తానికి రాజకీయ పార్టీలను జనం పూర్తిగా కన్ఫ్యూజన్‌లోకి నెట్టేస్తున్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన?ఇలా ఏ పార్టీ అయినా సభలు,సమావేశాలు నిర్వహించుకునేటప్పుడు భారీగా కేడర్ తో పాటు జనం కూడా హాజరయ్యేలా చూసుకుంటుంది. జనం హాజరును బట్టి అక్కడ స్థానికంగా ఉన్న బలాబలాలను బేరీజు వేసుకుంటాయి పార్టీలు. ఓ రకంగా సభలకు పార్టీ లీడర్స్, క్యాడర్స్‌లో నైతిక బలాన్ని పెంచుతుంది ఏ బహిరంగ సభ జరిగినా జనసమీకరణకు రాజకీయ పార్టీలు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తాయి.

# రైతులను కరువుకు వదిలేసిన కర్కశ ప్రభుత్వం : నారా లోకేశ్



అమరావతి,నవంబర్4 రైతాంగాన్ని కరువుకు వదిలేసిన కర్కశ ప్రభుత్వం అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కామెంట్స్ నారా లోకేష్ విరుచుకుపడ్డారు. కరువుపై చర్చించని క్యాబినెట్ మీటింగ్ ఎందుకు? అని ప్రశ్నించారు. శనివారం మీడియాతో మాట్లాడ ుతూ.. కర్నూలు జిల్లాలో కరువు కారణంగా పనుల్లేక ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయన్న వార్తలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. వందేళ్లలో ఈ ఏడాదే అతి తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడంపై ఉన్న శ్రద్ధ కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంపై లేదని మండిపడ్డారు. అడ్డగోలు దోపిడీపై తప్ప కరువు నివారణ చర్యలు చేపట్టాలన్న సోయి లేదన్నారు. తీవ్ర కరువు పరిస్థితుల్లో రైతాంగం ఉంటే... వారి సమ స్యలపై క్యాబినెట్ సమావేశంలో కనీసం చర్చించకపోవడం జగన్ ప్రభుత్వానికి అన్నదాతల సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం కనీసం సమీక్ష చేయకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. 400 మండలాల్లో కరువు పరిస్థితులు ఉంటే కేవలం 100 మండలాల్లో కరువు అని ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. కరువు కోరల్లో చిక్కి రైతాంగం విలవిల్లాడుతున్న ఈ కష్టకాలంలో నిబంధనలను సడలించి అయినా యుద్ధప్రాతిపదికన రైతులను ఆదుకోవాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను అని లోకేష్ పేర్కొన్నారు

# నవంబరు 6 నుండి ఇంజనీరింగ్ ప్రత్యేక దశ



- అడ్మిషన్ల ప్రక్రియ ఎపిఈఎపిసెట్
- 2023 కన్వీనర్ చదలవాడ నాగరాణి

విజయవాడ నవంబర్ 4 ప్రత్యేక రౌండ్ ప్రవేశాలకు ప్రభుత్వ పథకాల వర్తింపు తొలి, తుది, స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందలేని వారికి సదవకాశం నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేదు ఇంజనీరింగ్ ప్రత్యేక దశ అడ్మిషన్ల ప్రక్రియకు నవంబరు ఆరవ తేదీ నుండి ప్రారంభం అవుతుందని ఎపిఈఎపిసెట్ కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉన్నత విద్యామండలి జారీ చేసిన జీవో నెం.179ను అనుసరించి ఏపీఈఈసెట్-2023 లో అర్హత సాధించిన అభ్యర్థులు కోసం దీనిని నిర్దేశించామన్నారు. తొలి మలి దశతో పాటు స్పాట్ అడ్మిషన్లు ఇప్పటికే ముగిసాయని, కేవలం ఈ సంవత్సరాలనికి మాత్రమే వర్తించేలా ఈ ప్రత్యేక కౌన్సిలింగ్ ను చేపడుతున్నామని పేర్కొన్నారు. తొలి, మలి దశ కౌన్సిలింగ్, స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందలేని విద్యార్థులు ఈ ప్రత్యేక దశ కౌన్సిలింగ్ కు అర్హత కలిగి ఉంటారన్నారు.అయితే ఇప్పటికే ప్రవేశాల కోసం రిజిస్టేషన్ చేసుకున్న వారిని మాత్రమే ఈ ప్రత్యేక దశలో ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటుదని, కొత్తగా రిజిస్ట్రేషన్లకు అవకాశం లేదని నాగరాణి స్పష్టం చేసారు. విద్యార్థుల నుండి భిన్న రూపాలలో వచ్చిన అభ్యర్థనల ఫలితంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ప్రత్యేక కౌన్సిలింగ్ కు అనుమతి ఇచ్చారని, మరో వైపు విద్యా శాఖ మంత్రి బొత్సా సత్యన్నారాయణ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈవిషయంలో ప్రత్యేక చొరవ చూపారని నాగరాణి పేర్కొన్నారు. ప్రత్యేక రౌండ్ లో చేసిన ప్రవేశాలకు కూడా కన్వీనర్ కోటాతో సమానంగా ఫీజు రీఎంబర్స్ మెంట్ వంటి అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు అనుమతి ఉందని కన్వీనర్ వివరించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల లోని బీఈ/బీటెక్ కోర్సుల్లో ఖాళీలను అనుసరించి, నిబంధనల మేరకు ప్రవేశం కల్పిస్తామన్నారు. శనివారం నోటిఫికేషన్ జారీ చేయగా, నవంబరు 6, 7 తేదీలలో రెండు రోజుల పాటు ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. నవంబరు 8వ తేదీ ఆప్షన్ల నమోదు, మార్పుకు అనుమతి ఉంటుందని తెలిపారు. నవంబరు పదిన సీట్ల కేటాయింపు జరుగుతుందని, సీట్లు కేటాయించిన కళాశాలలో నవంబరు 11 నుండి 13 వరకు విద్యార్థులు వ్యక్తిగతంగా రిపోర్టు చేయవలసి ఉందని ఎపిఈఎపిసెట్ కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

# రైతు గర్జన ర్యాలీని జయప్రదం చేయండి.

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే. బాబురావు.

కర్నూలు నవంబర్ 04 విభారె న్యూస్.ఈనెల 7వ తేదీన జరుగు కాంగ్రెస్ రైతు గర్జన ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబు రావు తెలియజేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఇన్చార్జిలు, నియోజకవర్గాల కో ఆర్డినేటర్ల సమావేశంలో బాబురావు, మాట్లాడుతూ నా మీద నమ్మకంతో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నియమించినఅఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కి, శ్రీమతి సోనియా గాంధీ కి ప్రియతమ నాయకులు రాహుల్ గాంధీ కి ప్రియాంక గాంధీ కి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకి సి డబ్ల్యూ సి సభ్యులు ఎన్ రఘువీరా రెడ్డి కి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి సిడి మయ్యప్పన్ కి రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మస్తాన్ వలి కి మొదలగు నాయకులకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేయుచున్నానని ముఖ్యంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నందలి 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు, జే లక్ష్మీ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు,సిడబ్ల్యుసి సభ్యులు ఎన్ రఘువీరారెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి సిడి మయప్పన్, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి కర్నూలు నగరంలో జరుగు కార్యక్రమమునకు విచ్చేయుచున్నందున ముందుగా ఏడవ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక రాజవిహార్ సెంటర్ నందలి అంబేద్కర్ భవన్ నుండి పాదయాత్రగా బయలుదేరి స్థానిక కలెక్టరేట్ వద్ద రైతులకు మద్దతుగా నిరసన తెలియజేసి అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పిస్తారని అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరుగుతున్న నూతన అధ్యక్షులు పదవీ బాధ్యతల కార్యక్రమము అనంతరం కార్యకర్తల సమావేశం జరుగునని కనుక ఈ కార్యక్రమమునకు ఉమ్మడి కర్నూలు జిల్లా నందలి రైతు సోదరులు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నామని బాబురావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ మాజీ మంత్రి మూలింటి మారెప్ప ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న ఆదోని నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్స్ దేవిశెట్టి ప్రకాష్ బీ నీలకంఠప్ప మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నూర్ అహ్మద్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతుల శేఖర్ ఆలూరు కో ఆర్డినేషన్ మెంబెర్ చిప్పగిరి లక్ష్మి నారాయణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఏ కరుణాకర్ బాబు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మారుతీ మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ మహిళా సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఏ వెంకట సుజాత డిసిసి ఉపాధ్యక్షులు ఎన్ చంద్ర శేఖర్ డిసిసి కార్యదర్శులు లాజరస్ ఎజాస్ రియాజ్ మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఖాద్రి కాంగ్రెస్ నాయకులు మున్నా నాగశేషు వశీ భాష అమ్మానుల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సమీవుల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు కె వి లక్ష్మి మొదలగువారు పాల్గొన్నారు.




# ఎంపి విజయసాయి బెయిల్ రద్దు చేయాలి

## సీజేఐకి పురందేశ్వరి ఫిర్యాదు



విజయవాడ ,ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేసారు. ఇటీవల వైసీపీ, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నెలకొన్నది తెలిసిందే. .పదేళ్లుగా విజయసాయిరెడ్డి బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారని.. జనాలను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని పురందేశ్వరి లేఖలో పేర్కొన్నారు.విజయసాయి తన పదవులను అడ్డంపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని.. బెయిల్పై బయటకు వచ్చిన తరువాతలో ఏపీలో మద్యం, ఇసుక, భూముల, మైనింగ్లో అక్రమాలకు పాల్పడ్డారని అంటూ ఫిర్యాదు చేసారు. విజయసాయిపై నమోదైన కేసుల తాలూకా వివరాలతో పాటు ఇటీవల మద్యం, ఇసుక, మైనింగ్ వివరాలను జత చేస్తూ.. ఆయన బెయిల్ రద్దు చేయాలని లేఖలో పురందేశ్వరి కోరారు.

# నేపాల్ భూకంప ఘటనపై ప్రధాని మోడీ తీవ్రగ్భ్రాంతి

నేపాల్ భూకంప ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తీవ్రగ్భ్రాం తి వ్యక్త చేశారు. భూకంప మృతులకు ఈ సందర్భంగా మోడీ సంతాపం తెలిపారు. శుక్రవారం రాత్రి నేపాల్ లో భారీ భూ ప్రకంపనలు సంభవించడంతో పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున్న ప్రాణ నష్టం జరిగింది. ఈ ఘటనలో వందల మంది తీవ్రంగా గాయపడినట్లు.. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఈ ఘటనపై ప్రధాని మోడీ స్పందిస్తూ.. నేపాల్ ప్రజలకు భారత్ సంఘీభావంగా నిలుస్తుందని.. నేపాల్ కు అన్ని రకాలుగా సాయం అందించేందుకు భారత్ సిద్దంగా ఉందన్నారు. ప్రస్తుతం నేపాల్ లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# సంపాదకీయం

ఆదివారం 05-11-2023

## ఇలా అయితే..ముందుకు ఎలా

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కొద్ది నెలల ముందు జరుగుతున్న ఈ 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలన్నీ సెమీ ఫైనల్‌గా పరిగణిస్తున్నాయి. హిందీ మాతృభాషగా కలిగిన రాష్ట్రాల్లో గట్టి పట్టున్న బీజేపీని ఎదుర్కోవాలంటే బీజేపీ వ్యతిరేక శక్తులన్నింటినీ ఏకం చేయాలని భావించిన కాంగ్రెస్ పార్టీకి హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సాధించిన విజయం ఆత్మవిశ్వాసాన్ని, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ ఉత్సాహంతో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాల్లో గెలుపొందడానికి ఉన్న ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలిపెట్టుకోవద్దని భావిస్తోంది. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో పోటీ పడుతుండగా.. మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)యే ఉంది. సాధారణంగా ఎక్కడైనా రాజకీయ పార్టీల మధ్య పొత్తులు పరస్పర ప్రయోజనాలకు కల్గిస్తాయి. కానీ ఈ నాలుగు రాష్ట్రాల్లో పొత్తులు కాంగ్రెస్ పార్టీకి పెద్ద సమస్యగా మారాయి. విపక్ష కూటమి (ఎ.ఐ.ఆ.ఎ.ం) ఏర్పడినప్పుడు, విబేధాలు మరచి పరస్పర సహకారంతో బీజేపీని ఓడించడమే తమ ఏకైక లక్ష్యమని విపక్షాలన్నీ పదే పదే పునరుద్ఘాటించాయి. కానీ ఆ తర్వాత కొద్ది రోజులకే వచ్చిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఏ కోశానా ఈ మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేసినట్టుగా కనిపించడం లేదు. ఇందుక్కారణం.. పొత్తులతో లాభం కంటే నష్టమే ఎక్కువ అని కాంగ్రెస్ అంచనా వేయడమే. సమాజ్‌వాదీ పార్టీ మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని పోటీ చేయాలని భావించింది. ఈ మేరకు సంప్రదింపులు కూడా జరిగాయి. ఒక దశలో మధ్యప్రదేశ్‌లో 6 సీట్లు, రాజస్థాన్‌లో 10 సీట్లు ఆ పార్టీకి కేటాయించాలని పట్టుబట్టింది. సాధారణ పరిస్థితుల్లో కొన్ని సీట్లు మిత్రపక్షాలకు ఇవ్వడం వల్ల నష్టం లేకపోగా, ఎంతో కొంత ప్రయోజనమే ఉంటుంది. కానీ కాంగ్రెస్ ? బీజేపీ మధ్య ముఖాముఖి పోరు ఉన్న రాష్ట్రాల్లో మరో ప్రాంతీయ పార్టీకి అవకాశం కల్పిస్తే మొదటికే మోసం అని కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది. కేవలం ఉత్తర్‌ప్రదేశ్‌లో మాత్రమే పట్టున్న సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీలు హిందీ మాట్లాడే ఇతర రాష్ట్రాల్లో అడపా దడపా పోటీ చేయడం, స్థానిక నేతల వ్యక్తిగత బలం కారణంగా ఒకట్రెండు స్థానాల్లో గెలుపొందడం జరుగుతోంది. అయితే సమాజ్‌వాదీ పార్టీ ఈసారి కాంగ్రెస్‌తో జట్టుకట్టి మరిన్ని ఎక్కువ స్థానాల్లో గెలుపొందాలని, తద్వారా ఆ రాష్ట్రాల్లోనూ తమ పార్టీని విస్తరించి జాతీయ పార్టీగా అవతరించాలని భావిస్తోంది. కాంగ్రెస్ మాత్రం తాము బలంగా ఉన్నచోట ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంకో పార్టీకి అవకాశం ఇవ్వొద్దని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. సమాజ్‌వాదీ కోసం కాంగ్రెస్ ఎన్ని సీట్లు కేటాయించినా.. అక్కడ కాంగ్రెస్ టికెట్ ఆశించిన నేతతో పాటు కార్యకర్తలు వెంటనే తిరుగుబాటు చేసి బీజేపీలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. మళ్లీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ కోలుకోవడం కష్టంగా మారుతుంది. 90వ దశకంలో యూపీలో బీఎస్పీతో పొత్తు తర్వాత కాంగ్రెస్ ఎదుర్కొన్న అనుభవాలు ఇదే పాఠాన్ని బోధించాయి. సమాజ్‌వాదీతోనే కాదు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), సీపీఐ, సీపీఐ(ఎం)లలో ఏ ఒక్క పార్టీతో కూడా పొత్తు పెట్టుకోకుండానే కాంగ్రెస్ ముందడుగు వేస్తోంది. ఇదే సమయంలో ఈ పార్టీలు చీల్చే ఓట్ల ద్వారా తమకు ఎక్కడైనా నష్టం జరుగుతుందా అన్న ఆందోళన కూడా కాంగ్రెస్ నేతల్లో అంతర్లీనంగా ఉంది. ఈ పార్టీలన్నీ కలిసి బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చిన పక్షంలో అది కచ్చితంగా బీజేపీకే లబ్ది చేకూర్చుతుంది. నేతల నుంచి గ్రౌండ్ రిపోర్టులు, సమాచారం అందుకున్న కాంగ్రెస్ అధిష్టానం ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక వ్యూహం రచించింది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర యూనిట్లకు మార్గదర్శనం చేస్తోంది. ఆ ప్రకారం క్రియాశీల పార్టీ కార్యకర్తలు, వాలంటీర్లతో కూడిన ప్రత్యేక బృందాలు ఇతర ప్రతిపక్ష పార్టీలు పోటీ చేసే నియోజకవర్గాలకు వెళ్లాలి. ఈ స్థానాల్లో కాంగ్రెస్‌కు కాకుండా మరే ఇతర పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి లాభం చేకూరుతుందని ప్రజలకు వివరించి చెప్పాలి. తద్వారా జాతీయస్థాయిలో తమ మిత్ర కూటమిలో ఉన్న పార్టీలపై మాటలదాడి చేయకుండా.. తమ సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు ఎ.ఐ.ఆ.ఎ.ం పార్టీలను బీజేపీకి కోవర్టులనో.. బీ-టీమ్ అనో నిందించడం కూడా మానుకోవాలి. కాంగ్రెస్ నేతల ప్రసంగాలు, విలేకరుల సమావేశాలలో రాష్ట్రంలో ప్రత్యక్ష పోటీ తమకు బీజేపీకి మధ్యనే ఉందని పదే పదే నొక్కి చెప్పాలి. బీజేపీని ఓడించేందుకు వేసే ప్రతి ఓటూ  ఇదీ క్లుప్తంగా కాంగ్రెస్ వ్యూహం సారాంశం. ఉత్తరాది రాష్ట్రాల్లో అనుభవాలకు తోడు స్థానిక పరిస్థితుల రీత్యా కమ్యూనిస్టులతో పొత్తుల విషయంలో తెలంగాణలో వెనుకడుగు వేస్తున్నట్టు కనిపిస్తోంది. తొలుత సీపీఐకి చెన్నూరు, కొత్తగూడెం ఇస్తామని కాంగ్రెస్ హైకమాండ్ నుంచి కేసీ వేణుగోపాల్ స్వయంగా ఆ పార్టీ నేతలకు ఫోన్ చేసి చెప్పారు.

# మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ముద్దాయి అరెస్ట్

## 10 మోటార్ సైకిల్ లు స్వాదీనం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఐపీఎస్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 04: కడప జిల్లా పొద్దుటూరు మండలం తాల్లమాపురం గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న పది మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 15న ఆళ్లగడ్డ పట్టణంలోని బస్టాండు ఎదురుగా అపోలో మెడికల్ స్టోర్ కి ముందుగా ఉంచిన పల్సర్ 150 మోటార్ సైకిల్(ఏపీ 39 ఎక్స్ 3470) పార్కింగ్ చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకునిపోయారని చాగలమర్రి కి చెందిన ముల్లా సర్తాజ్ నవాజ్ ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారన్నారు. ఈ మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షణ లో రాబడిన సమాచారం మేరకు ఆళ్లగడ్డ పట్టణ శివార్లలో ఉన్న పీ వి ఎస్ ఆర్ గోడౌన్ దగ్గర ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ సి ఐ రమేష్ బాబు ఆధ్వర్యములో ఎస్సై కే పి బి వెంకట రెడ్డి తన సిబ్బంది సహాయముతో ముద్దాయి అయిన



షేక్ దస్తగిరిని అను వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి ఈ కేసులో చోరి కాబడిన పల్సర్-150 మోటార్ సైకిల్ ఏపీ 39 ఎక్స్ 3470 మరియు 9 మోటార్ సైకిల్ లు కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూర్, మైదుకూర్, కడప లలో దొంగలినీచినవి స్వాధీననీ చేసుకోవడం జరిగిందన్నారు. ముద్దాయి దస్తగిరిని రిమాండ్ నిమిత్తము కోర్టు లో హాజరు పరిచామన్నారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన సిబ్బంది ఎస్ ఐ వెంకట రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వర రావు, నాగరాజు కానిస్టేబుళ్లు బాలాజీ నాయక్, మద్దిలేటి, లక్ష్మి నారాయణ మరియు హోంగార్డ్ ప్రసాదు లను నంద్యాల జిల్లా ఎస్పీ అభినందించారు.

## 8న విద్యుత్ సమస్యలపై ప్రత్యేక కోర్టు.....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- నవంబర్ 4 ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపి సంస్థ ఆపరేషన్ డివిజన్ డోన్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక కోర్టు విద్యుత్ డోన్ కొత్త బస్టాండ్ సమీపంలో గల డివిజన్ ఆఫీస్ ఆవరణలో వినియోగదారుల సమస్యలపై సమస్య పరిష్కార వేదిక తిరుపతి వారిచే నిర్వహించబడునని ఎగ్జిక్యూటివ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి ప్రసాద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు శ్రీనివాస ఆంజనేయులు మూర్తి చైర్ పర్సన్, రామ్మోహన్ రావు ఆర్థిక సభ్యులు, అంజనీ కుమార్ సాంకేతిక సభ్యులు, ఈశ్వరమ్మ స్వతంత్ర సభ్యులు. వీరి ఆధ్వర్యంలో నిర్వహించబడును అని తెలిపారు. కావున డోన్, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలంలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన తెలిపారు.

## వలస బాట పట్టిన కూలీలు



పెద్దకడబూరు నవంబరు 04 ( విభారె న్యూస్) పెద్దకడుబూరు మండలం చిన్నతుంబలంలో శనివారం 75 రైతు కూలీ కుటుంబాలు గుంటూరుకు వలస బాట పట్టారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని పోవడం, మిరప లాంటి పంటలు ఇప్పుడిప్పుడే కాపుకు వచ్చే దశలో ఉన్నాయి. ఎల్లెల్సీకి ఈ నెల 25 వరకే సాగునీరు విడుదల అవుతుందని ఇరిగేషన్ అధికారులు ప్రకటించడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీంతో గ్రామాల్లో పనులులేక ఉపాధి కరువై కూలీలు వలస బాట పట్టారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని వ్యతిరేకించండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి వాసుదేవరావు

భీమవరం అక్టోబర్ 4 దేశంలో నిరుద్యోగం పెంచుతూ మరోవైపు నిత్యవసర వస్తువుల ధరలను అదుపులో పెట్టకుండా నిర్లక్ష్యం చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వాసుదేవరావు ప్రజలకు పిలుపునిచ్చారు శనివారం సిపిఎం ప్రజా రక్షణ బేరి ప్రచారయాత్రను రెండవ రోజు భీమవరంలోని లంకపేట, ప్రకాశం సెంటర్ ,మావుళ్ళమ్మ సెంటర్ ,మున్సివల్ కాలనీ, వైయస్సార్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వానుదేవరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాల్లో అనేక సార్లు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని ప్రభుత్వ రంగ సంస్థలు మూతవడ్డాయని నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు .పేదల ఎకౌంట్లో నల్లధనాన్ని వేస్తామన్నా మోడీ ఎందుకు వాగ్దానాన్ని అమలు చేయలేదని ప్రశ్నించారు తొమ్మిదోన్నర సంవత్సరాలలో కొద్దిమందిగా ఉన్న కార్పొరేట్లకు సుమారుగా 14 లక్షల కోట్ల రూపాయలు దోచి పెట్టారని పేద మధ్యతరగతి వర్గాలపై పన్నులు బారాలు పెంచారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ,వెనకబడిన ప్రాంతాలకు నిధులు రైల్వే జోన్ ఇస్తానన్న రాష్ట్ర విభజన హామీలు



అమలు చేయలేదన్నారు లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చి పేదలను, రైతులను పట్టించుకోకుండా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వాని కి బుద్ధిచేప్పాలన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విపరీతంగా ఇంటి పన్నులు పెంచుతూ కొత్తగా చెత్త పన్నులను ప్రజలపై వేస్తుందన్నారు . కరెంట్ బిల్లులు దారుణం గా పెంచివేసిందన్నారు. ఉపాధి అవకాశాలు లేక పేదలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపి విధానాలను, వైఫల్యం లను విమర్శించకుండా వైసిపి, బిజెపి ,జనసేనలు , బిజెపికి దాసోహం అంటున్నాయన్నారు.. ఇప్పటికైనా రాష్ట్ర భవిష్యత్తు కోసం బిజెపి నుండి అధికార పక్షం, ప్రతిపక్షం, జనసేన లు బయటకు రావాలని సిపిఎం కోరుతుందన్నారు.. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున నికరంగా సిపి యం పోరాడుతుందన్నారు. సిపిఎం పార్టీ చేస్తున్న పోరాటాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో టిట్కో ఇల్లు ప్రజలకు అందించడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యం చెందిందనన్నారు. వెంటనే టిడ్కో ఇల్లు నిర్మాణం లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో ప్రజానాట్యమండలి కళాకారులుగేయాలు ఆలపించారు. యాత్రలో సిపిఎం జిల్లా నాయకులు బి కళ్యాణి, ఎం వైకుంఠరావు ,షేక్ వలీ,బి .చైతన్య ప్రసాద్ ,డి త్రిమూర్తులు ,బి. శ్రీరాములు భార్గవ తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి రూ 20 లక్షల చెక్ అందజేసిన ఎమ్మెల్యే



కోసిగి, నవంబర్ 04 (విభారె న్యూస్) ఇటీవల విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ఘోర ప్రమాదంలో కోసిగి మండలం అగసనూర్ గ్రామానికి చెందిన చాకలి తాయప్ప అనే యువకుడు మృతి చెందిన విషయం ప్రజలకు తెలిసిందే, ఇందుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుండి వచ్చిన పరిహారం 20 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మృతుడు కుటుంబ సభ్యులకు శనివారం నాడు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన10 లక్షలు, రైల్వే శాఖ ప్రకటించిన మరో 10 లక్షల రూపాయలు పరిహారండబ్బులుకలిపిమొత్తం20లక్షల రూపాయలు చెక్కును అందజేశారు .ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కి ఇంఛార్జ్ మురళీమోహన్ రెడ్డి కి బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అక్రిడేషన్ లేకున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని జాబ్ యూనియన్ మండల అధ్యకుడు రంగముని డిమాండ్



పెద్ద కడబూరు నవంబరు 04 (విభారె న్యూస్)పెద్దకడుబూరు మండలంలో పనిచేస్తున్న ప్రతి వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ సంబంధం లేకుండా ఇంటి స్థలాలు ఇవ్వాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాబ్) మండల అధ్యక్షుడు రంగముని జాబ్ కమిటీ సహాయ కార్యదర్శి బజారి స్థానిక పెద్దకడబూరు మండల ప్రెస్ క్లబ్లో శనివారం డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు వారిది కావున జర్నలిస్టులకు అక్రిడేషన్ నిబంధన లేకుండా ఇంటి స్థలాలను ఇవ్వాలని అందుకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడేషన్తో సంబంధం లేకుండా ఇంటి స్థలాలు కేటాయించాలని జాబ్ ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం జరిగిందని మండల అధ్యక్షుడు రంగముని స్పష్టంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాబ్ యూనియన్ సహాయ కార్యదర్శిలు బజారి, రిషి, రామకృష్ణ, భీమన్న, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం

తాడేపల్లిగూడెం నవంబర్ 04 టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వలవల మల్లిఖార్జున రావు (బాబ్జి) ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం,కోత్తూరు గ్రామం, అరోగొలను గ్రామంలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పరిమి రవికుమార్, పోతుల అన్నవరం, వాడపల్లి సుబ్బరాజు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, వట్టూరి రాంబాబు, కనకారావు, మద్దుకూరి ధనరాజ్,పిల్లా రాంబాబు, శనగన రాంబాబు, పరిమి వీరభద్రరావు, గంగరాజు,కోటయ్య, ముప్పిడి రమేష్, పసలపూడి రాంబాబుతాడేపల్లిగూడెంరూరల్‌మండలం నాయకులు. కోత్తూరు గ్రామం నాయకులు తిరుమల బాబీ,కుడవల్లి హనుమంత్(సర్పంచ్),చిక్కాల బ్రహ్మం,తిరుమల సత్తిబాబు, ఇళ్ళ పేద కాపు,అడపా శ్రీనివాసరావు, ములగాల శివ,తిరు మల గంగాధర్,చిక్కాల సూర్యనారాయణ, బండి రాధాక్రిష్న, కమిసిట్టి సురిపండు,అకులా శ్రీనివాస్,ఉప్పు వెంకటేశ్వరరావు, గ్రామనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. అరోగొలను గ్రామం నాయకులు పీతల బుచ్చిబాబు (సర్పంచ్), వట్టురి రాంబాబు, కసగని రాజేష్,గరపాకమూర్తి,మలకవెంకట రావు,సిర్ర వెంకటేష్,విరమల్లు శ్రీను, విరమళ్ల వీరాస్వామి, విరమాల్లు సురిచంద్రం,బయ్య ధనరాజ్,విరామల్లు శ్రీను,షేక్ శామీర్,షేక్ అబుహాసన్,షేక్‌హుషెన్ సాయి ఆరుగోలను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కడపలో యునానీ రీసెర్చి సెంటర్

కడప, నవంబర్ 4, ఏపీ సీఎం వైఎస్ జగన్ కు కేంద్రం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో విభజన తర్వాత ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో పలు పెండింగ్ హామీల అమలు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. ఇలాంటి తరుణంలో ఎన్నికలకు ముందు సీఎం జగన్ సొంత జిల్లా వైఎస్సార్ కు ఓ కీలకమైన పరిశోధనా కేంద్రాన్ని కేటాయిస్తూ కేంద్రం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇది త్వరలోనే అమలు కానుంది. వైఎస్సార్ జిల్లాలో జాతీయ స్థాయి యునానీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తొలిసారిగా అప్పటి కడప జిల్లాలో ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలంటూ కేంద్రానికి అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రతిపాదన పంపారు. ఇందు కోసం జిల్లాలో 25 ఎకరాల స్థలం కూడా ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అయితే కేంద్రం మాత్రం వెంటనే స్పందించలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ తో పాటు ఎంపీలు కూడా కేంద్రానికి ఈ యునానీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు ఇచ్చారు. అలాగే జిల్లాలో ఉచితంగా భూమి కూడా కేటాయించేందుకు సిద్ధమని తెలిపారు. విభజన తర్వాత ఏపీకి యూనానీ రీసెర్చ్ సెంటర్ లేకపోవడంతో తెలంగాణకు మేలు జరుగుతోందని కూడా వివరించారు. దీంతో సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత కేంద్రం జగన్ సొంత జిల్లా వైఎస్సార్ లో యూనానీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు అవసరాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. తాజాగా కడప శివార్లలోని ఏర్పాటు కోసం రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి కేంద్రమంత్రి శర్బానంద్ సోనేవాల్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

## ఎలాంటి పొరపాటు లేకుండా చూడాలి

**రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు**

**రాచకొండ సీపీ డిఎస్ చౌహాన్**

రాచకొండ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసిపిలు , ఎస్ఐలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం మరియు ఇతర సిబ్బందికి ఎన్నికల నిబంధనల మీద ఆన్లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించిన కమిషనర్త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని నామినేషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో చేపట్టవలసిన భద్రత ఏర్పాట్లను మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడానికి ఈరోజు రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ డిఎస్ చౌహాన్ ఐపిఎస్ గారు రాచకొండ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసిపిలు, ఎస్ హెచ్ఓ లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీం మరియు ఇతర సిబ్బందికి ఆన్లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎన్నికల నిర్వహణ బందోబస్తు సమయంలో పాటించవలసిన నిబంధనల మీద సిబ్బందికి గల పరిజ్ఞానాన్ని పరీక్షించడంతో పాటు నిబంధనల మీద అవగాహన కల్పించారు.

# మితిమీరుతున్న ఆర్థిక లోటు...

విజయవాడ, నవంబర్ 4, రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి దేశానికే మార్గదర్శకంగా ఉన్నామని, గత తెలుగుదేశం ప్రభుత్వం కన్నా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం తక్కువ అప్పు చేసి కూడా ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తోందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్దిదారులకు నిధులు విడుదల చేసినప్పుడల్లా చెబుతున్నారు. పేదవారికి సంక్షేమ పథకాల కోసం ఎఫ్ఆర్బిఎం పరిమితులకు లోబడి అప్పు చేస్తే తప్పేంటని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. దీనికి ఉదాహరణగా 2023 జూలై 31న లోక్ సభలో ఒక ప్రశ్నకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పు 4.42 లక్షల కోట్లని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పు రూ.1,77,991 లక్షల కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన సమాధానాన్ని చూపుతున్నారు.వాస్తవానికి ఈ లెక్కలు కేంద్ర ప్రభుత్వం తేల్చినవి కాదు. ' స్టేట్ ఫైనాన్స్ ఏ స్టడీ ఆఫ్ బడ్జెట్స్ 2022-23' పేరిట ఆర్బీఐ ప్రచురించిన గణాంకాల ఆధారంగా తామీ వివరాలు వెల్లడిస్తున్నట్లు కేంద్రం పార్లమెంటుకు ఇచ్చిన అధికారిక పత్రాల్లో స్పష్టం చేసింది. అంటే కేంద్రం వెల్లడించినా, ఆర్బీఐ తన వెబ్ సైట్లో చూపినా అవన్నీ రాష్ట్రం అందచేసిన అప్పుల లెక్కలే. అయితే ఆర్థిక మంత్రి కేవలం రాష్ట్ర ప్రభుత్వం చేసిన పబ్లిక్ అప్పులు గురించి మాత్రమే సమాచారం ఇచ్చారని, వివిధ కార్పొరేషన్ల అప్పులు, గ్యారంటీ, నాన్ గ్యారంటీ రుణాలు, పెండింగ్ బిల్లులు, బకాయిలు కలిపి రాష్ట్ర అప్పులు రూ. 11 లక్షల కోట్లు దాటిపోయాయని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధారాలతో సహా వివరిస్తున్నారు.జగన్మోహన్ రెడ్డి అస్తవ్యస్త ఆర్థిక విధానాల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా దిగజారిపోతోందని, అప్పు చేయనిదే రోజు గడవని పరిస్థితి దాపురించిందని ఆర్థిక నిపుణులు, ప్రతిపక్ష నేతలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఉల్లంఘనలకు పాల్పడుతోందంటూ 2022 ఆగస్టు నెలలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టి వి సోమనాధన్ రాష్ట్ర ప్రభుత్వానికి ఘాటు లేఖ రాశారు. రాజ్యాంగ నిబంధనలను, ఎఫ్ఆర్బిఎం చట్టాన్ని ఉల్లంఘించడమే కాక, రాష్ట్ర ఎఫ్ఆర్బిఎం నిబంధనలను ఇష్టానుసారం సవరించుకోవడం, ప్రభుత్వ రంగ సంస్థల ఆడిట్ రిపోర్టులను రహస్యంగా ఉంచడం వంటి చర్యల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక నేరాలకు పాల్పడుతోందని వారు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. బటన్ నొక్కి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం కోసం అప్పు చేస్తే విమర్శించడం ఎంతవరకు సబబు అని జగనీయులు సమర్థించుకుంటున్నారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019 జూలై 10న విడుదల చేసిన శ్వేత పత్రం ప్రకారం 2019 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు (గత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు, చెల్లించాల్సిన బకాయిలు మొత్తం కలసి) రూ.3,62,372 కోట్లు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ బహిరంగ మార్కెట్ రుణం సుమారు రూ.4,90,000 కోట్లు, ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన కార్పొరేషన్ల రుణం (ప్రభుత్వం వెల్లడించిన ప్రకారం మార్చి 2022 వరకు) రూ.1,89,700.63 కోట్లు, నాన్ గ్యారంటీ రుణాలు (మార్ట్

**పరిమితి మించిన అప్పులు**

గేజ్ ) రూ.94,928 కోట్లు, పెండింగ్ బిల్లులు, విద్యుత్ డిస్కంలకు బకాయిలు రూ .1,95,000 కోట్లు, ప్రభుత్వ సంస్థల నుండి తీసుకున్న డిపాజిట్లు, గ్రామ పంచాయతీల నుండి దారి మళ్లించిన నిధులు, ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల నుంచి వాడేసిన వేల కోట్ల నిధులు మొత్తం కలిపితే ప్రస్తుత రాష్ట్ర అప్పులు, బకాయిలు రూ.11 లక్షల కోట్ల పైమాటే అంటున్నారు ఆర్థిక నిపుణులు. దీనిలో గత ప్రభుత్వాలు చేసిన అప్పులు (2019 జూలై 10న శ్వేత పత్రం ప్రకారం) తీసివేస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన అప్పు రూ.7,37,628 కోట్లు. మరి సంక్షేమం కోసం రూ.2,35,000 కోట్లు ఖర్చు చేశామని ఇటీవలే ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాటలు నిజమే అనుకున్నా మిగతా అప్పు సుమారు రూ.5 లక్షల కోట్లు ఏమైనట్లు దేనికి ఖర్చు చేసినట్లు? ఎదురు దాడి కాకుండా ఈ సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పాలకుల మీదుందిఇక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ కార్పొరేషన్ల వ్యవహారం కాగ్ (కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా)కు కూడా అంతుచిక్కని బ్రహ్మ పదార్థంలా ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 ప్రకారం రాష్ట్రానికి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని అనుసరించి కేంద్రం నిర్దేశించిన పరిమితికి లోబడి మాత్రమే అప్పులు తెచ్చుకొని రాష్ట్రాన్ని నడపాలి. సమస్త రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు, ఉచిత సంక్షేమ పథకాల ఖర్చులు కూడా ఇందులోనే ఉండాలి. ఒకవేళ ఖర్చులు పెరిగి, ఎక్కువ మొత్తంలో అప్పులు తీసుకోవాలంటే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి నిబంధనలకు విరుద్ధంగా అప్పులు చేస్తోంది. ఏపీలో అనేక కార్పొరేషన్ రుణాలు తీసుకున్నా వాటికి ఎలాంటి కార్యకలాపాలు లేవు. ఒకవైపు పరిమితికి మించి అప్పులు చేస్తున్నారంటూ కేంద్రం హెచ్చరిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో కార్పొరేషన్ల పేరుతో అప్పు చేయడం కోసం కేంద్రానికి తెలియపరచకుండా ఎఫ్ఆర్బిఎం చట్టానికి, ఇతర చట్టాలకు స్వంత సవరణలు చేసుకుంటూ కార్పొరేషన్లకు ఇచ్చే అప్పుల గ్యారంటీ పరిమితిని 90 శాతం నుండి ఏకంగా 180 శాతానికి పెంచి ఎడాపెడా దొడ్డిదారిన అప్పులు చేస్తోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం. పైగా యధేచ్చగా కార్పొరేషన్ల ద్వారా అప్పు తెచ్చి నిబంధనలకు విరుద్ధంగా స్వంతానికి వాడుకుంటోంది. రాజ్యాంగానికి, చట్టాలకు జవాబుదారీగా ఉండవలసిన ప్రభుత్వం బ్యాంకుల సాయంతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను కాపాడడంలో అత్యంత ముఖ్యమైన ఎఫ్ఆర్బిఎం చట్టం, ఆర్టికల్ 293, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అధికరణాలు యథేచ్ఛగా ఉల్లంఘించి రోజుకో రీతిన ఆర్థిక నేరాలకు పాల్పడుతోందని తెలుగుదేశం ఘాటుగా విమర్శిస్తోంది. ఇవే నేరాలు ప్రైవేటు రంగంలో జరిగితే ఈడీ,సీబీఐ రంగంలోకి దిగి కేసులు పెట్టేవారని ఆర్థిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 118 కార్పొరేషన్లలో చురుకుగా పనిచేస్తున్న 97 సంస్థలలో విద్యుత్ రంగానికి చెందిన 40 సంస్థలే పూర్తి స్థాయిలో అకౌంట్స్ సమర్పించాయి. మరి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 57 కార్పొరేషన్లు కాగ్‌కు అకౌంట్స్ ఎందుకు సమర్పించ లేదు? ఈ గోప్యత దేనికోసం? ఎందుకని ప్రాధాన్యమైన స్కిల్ డెవలప్మెంట్, ఫైబర్ నెట్ కార్పొరేషన్లతో సహా అనేక సంస్థలు గత నాలుగున్నరేళ్లలో ఒక్కసారి కూడా ఆడిట్ చేయించలేదు.ఇక అప్పు చేసి మరీ సంక్షేమం అమలు చేస్తున్నామన్న అధికార వైసీపీ వాదన నిజాయతీ లేనిది. సంక్షేమ పథకాల కోసం అప్పు చేస్తున్నామన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తన ఆదాయం రూ.9,24,500 కోట్లలో సుమారు రూ.2,35,000 కోట్లు (25.42%) సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తే, రాష్ట్ర విభజన ఇబ్బందులు ఉన్నా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తన ఆదాయం రూ.6,15,960 కోట్లలో రూ.2,78,491 కోట్లు (45.21%) సంక్షేమ పథకాల కోసం వెచ్చించారనేది కాదనలేని సత్యం. 2014-15 నుంచి 2018-19 మధ్య తెలుగుదేశం హయాంలో కేంద్రం పన్నుల వాటా కింద (రూ.1,25,245 కోట్లు), గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద (రూ.1.09,270 కోట్లు) రూ.2,34,515 కోట్లు నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి వస్తే, 2019-20 నుంచి 2023-24 (బడ్జెట్ అంచనాల వరకు) వైకాపా హయాంలో రూ.3,54,727 కోట్ల (కేంద్ర పన్నుల వాటా రూ.1,67,603 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.1,87,124 కోట్లు) కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చాయి. మరి గత ప్రభుత్వం కంటే అదనంగా కేంద్రం పన్నుల వాటా, గ్రాంట్లు పెరగడం ద్వారా లభించిన రూ.1,20,212 కోట్లు, పెంచిన చార్జీలు, వడ్డించిన పన్నుల వలన చేకూరిన రెండు లక్షల కోట్ల అధిక ఆదాయం కూడా చాలక బటన్ నొక్కుడు కోసం లక్షల కోట్లు అప్పు చేసామంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ఇక 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మూలధన వ్యయంలో మన రాష్ట్రం అట్టడుగున నిలవడం ఆర్థిక అరాచకానికి పరాకాష్టగా నిపుణులు పేర్కొంటున్నారు.రాష్ట్రంలో రెవెన్యూ లోటు అంచనాలను మించిపోయింది, తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి ఉన్న రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.48 వేల కోట్లకు, రూ. 20 వేల కోట్లుగా ఉన్న ద్రవ్య లోటును రూ.60 వేల కోట్లకు చేర్చడం ఆందోళన కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ రాబడి కన్నా రెవెన్యూ ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఈ ఖర్చులో అంతా తిరిగి ఆదాయం సృష్టించలేని వాటికే వెళ్లి, రుణాలు వడ్డీ చెల్లింపులకే కొత్త అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించడం విచారకరం. రాష్ట్ర ప్రభుత్వం సమర్పిస్తున్న లెక్కలపై కాగ్ తీవ్ర అభ్యంతరం తెలిపి, వైసీపీ ప్రభుత్వం ఆర్థిక నిర్వహణలో దుర్మార్గమైన తప్పులు చేస్తోందని ఎత్తి చూపింది. ఇటువంటి తీవ్ర విమర్శలకు సమాధానం చెప్పి, ప్రజలకు నిజానిజాలు తెలియపరచవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. కాబట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారికంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసి ఆర్థిక నిపుణులు, పెట్టుబడిదారులు, రాష్ట్ర ప్రజల సందేహాలను నివారించి ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను నిలబెట్టాలి.

## ఏపీలో మళ్లీ జిల్లాల పునర్విభజన

ఏలూరు, నవంబర్ 4, ఏపీలో మరోసారి జిల్లాల పునర్విభజన పై ప్రభుత్వం మళ్ళీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో పోలవరం కొనసాగుతోంది. పోలవరం నిర్వాసితులకు ప్రత్యేక జిల్లా ఉండాలనే ఉద్దేశ్యంతో కొత్త జిల్లా ఏర్పాటు దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రోజు జరిగే మంత్రివర్గ సమావేశంలో జిల్లాల పునర్విభజన పైన నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. జిల్లాల పునర్విభజన :జిల్లాల పునర్విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో జిల్లాల సంఖ్య తగ్గనుండగా, మరికొన్ని చోట్ల పెరిగే అవకాశం ఉందని తెలిసింది. జిల్లాల సంఖ్యలో మార్పు లేకపోయినా.. మార్పులు దిశగా మాత్రం నిర్ణయం తీసుకొనే ఛాన్స్ ఉందని సమాచారం. జిల్లాల ఏర్పాటు తరువాత వచ్చిన అభ్యర్ధలు..డిమాండ్ల పైన అధ్యయనం జరిగింది. ఇందులో భాగంగా కొన్ని మార్పులు తెర మీదకు వచ్చినట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లా ఏర్పాటును రద్దు చేసి పాత కడప జిల్లాను పునరుద్దరించాలని అధికార పార్టీ నేతలు కోరుతున్నారు. కడప జిల్లాను అలానే ఉంచి, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజక వర్గాలను చిత్తూరు జిల్లాలో కలపాలని భావిస్తున్నట్లు తెలిసింది. కోడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపే అవకాశం ఉందని చెబుతున్నారు. దీని పైన కేబినెట్ లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.అనంతపురం జిల్లాను తిరిగి పూర్వస్థాయికి తీసుకురావాలనే చర్చ వినిపిస్తోంది. గిరిజన ప్రాంతాలతో ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు నుండి కూడా ప్రభుత్వం వెనక్కి తగ్గనున్నట్లు సమాచారం. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన ప్రాంతాలతో ఈ జిల్లాను ఏర్పాటు చేసారు. అయితే, చిన్న జిల్లా కావడం, పాలనాపరంగా అసౌకర్యంగా ఉండటం వంటి కారణాలతో పార్వతిపురం మన్యం జిల్లాను రద్దు చేసి..ఆ స్థానంలో పోలవరం కేంద్రంగా కొత్తగా మరో గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనకు గ్రీన్‌సిగల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు పోలవరం ప్రాంతం ఏలూరు జిల్లా పరిధిలో ఉండగా, మరో గిరిజన ప్రాంతమైన రంపచోడవరం నియోజకవర్గం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉంది. మంత్రివర్గంలో నిర్ణయం:ఆయా ప్రాంత గిరిజనులు ప్రస్తుతం జిల్లా కేంద్రమైన పాడేరుకు కార్యాలయ పనుల కోసం రావాలంటే కనీసం 200 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి రావడం కష్టమవుతోంది. దీనిపై పలు విజ్ఞప్తులు అందడంతో నూతన జిల్లా ఏర్పాటు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీనితో పాటు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్న వారికి పునరావాస పనులకు పరిపాలన సౌలభ్యం సులభమవుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. మన్యం జిల్లాను రద్దు చేసినా పోలవరం జిల్లా ఏర్పాటు ద్వారా గిరిజన జిల్లాల సంఖ్యలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదు. అయితే, ఈ మొత్తం ప్రతిపాదనల పైన మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## జగన్ కు అక్రమాస్తుల టెన్షన్

హైదరాబాద్, నవంబర్ 4, ఏపీలో కూడా రాజకీయం రసవత్తరంగా సాగుతున్నది. ఇప్పటికే విపక్ష తెలుగుదేశం దూకుడు మీద ఉండగా.. జనసేన కూడా తెలుగుదేశంకు తోడు కావడంతో అధికార వైసీపీలో ఓటమి భయం ముప్పిరి గొంది.ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ హైదరాబాద్ నుంచి వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ ను సుప్రీం శుక్రవారం విచారించనుంది. జగన్ పై సీబీఐ నమోదు చేసిన 11 కేసులు ఇప్పటి వరకూ 3,041 సార్లు వాయిదా పడ్డాయని తన పిటిషన్ లో పేర్కొన్న రఘురామకృష్ణం రాజు.. ఈ కేసులో విచారణ త్వరగా జరిపి నిందితులను శిక్షించాలన్న ఉద్దేశం సీబీఐలో కనిపించటం లేదని ఆరోపించారు. ఇందులో జగన్ కు ఇష్టానుసారం వాయిదాలు కోరే స్వేచ్ఛను ఇచ్చారని.. ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే కేసుల విచారణ ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించటం లేదని రఘురామరాజు తన పిటిషన్ లో పేర్కొన్నారు. తమిళనాడుకు ముఖ్యమంత్రిగా చేసిన జయలలిత అక్రమాస్తుల కేసుల విచారణను కర్నాటకలో విచారణ జరిపినట్లే.. ఇప్పుడు జగన్ కేసుల విచారణను తెలంగాణలో కాకుండా మరో రాష్ట్రంలో జరపాలని తన పిటీషన్‌లో కోరారు. జగన్ కేసుల విషయంలో విచారణ జాప్యం మీద సుప్రీం కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొని ఉంది. పిటిషనర్ ఎంపీ రఘురామ కోరినట్లుగా వేరే రాష్ట్రానికి ఈ కేసుని బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయా? ఒక వేళ ఉంటే ఏ రాష్ట్రానికి ఈ కేసు బదిలీ చేసే అవకాశం ఉంది అన్న చర్చ జోరందుకుంది. సుప్రీం ఈ కేసుపై అడిగే ప్రశ్నలకు సీబీఐ ఎలాంటి సమాధానం ఇవ్వనుంది.. ఎందుకు విచారణ ఇంత ఆలస్యమవుతుందంటే ఏ చెప్పనుందన్నది ఆసక్తిగా మారింది.ఈ కేసులో సుప్రీం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది జగన్ మోహన్ రెడ్డికి ఇబ్బందికరమే అవుతుంది. ఈ కేసు మరో రాష్ట్రానికి బదిలీ చేసినా.. సీబీఐ కోర్టు విచారణకు జగన్ రావాల్సిందేనని నోటీసులు ఇచ్చినా కూడా అది జగన్ కు ఇబ్బందికరంగానే మారుతుందనడంలో సందేహం లేదు. ఎన్నికల సమయంలో జగన్ అక్రమాస్తుల కేసులో కదలిక మళ్లీ జగన్ కేసులపై జనం దృష్టి మళ్లడానికి దోహదపడుతుందనడంలో సందేహం లేదు. స్కిల్ కేసులో చంద్రబాబు గొప్పతనంపై జనంలో చర్చ జరిగింది. అదే జగన్ అక్రమాస్తుల కేసులో కదలిక వస్తే.. జగన్ అక్రమార్జన, క్విడ్ ప్రోకో, అరెస్టు వంటి అంశాలపై జనంలో చర్చ జరుగుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీంతో కేసులో ఎలాంటి కదలిక వచ్చినా అది జగన్ ప్రతిష్టకు భగం వాటిల్లడమే కాకుండా.. ప్రతిపక్షాలకు ఒక ఆయుధంగా కూడా మారుతుంది. అసలే చంద్రబాబు అక్రమ అక్రమ అరెస్టుతో తెలుగుదేశం శ్రేణులు ఇప్పటికే పదే పదే జగన్ కేసులను ప్రస్తావిస్తున్నాయి. జగన్ బెయిలు దశాబ్ద ఉత్సవాలు అంటూ సెటైర్లు కూడా వేశాయి. ఇలాంటి సమయంలో సీబీఐ ఈ కేసు విచారణ వేగవంతం చేస్తే అది కచ్చితంగా జగన్ కు ఇబ్బందికరంగా మారుతుంది. అలాగే ఒకవేళ ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టులో జగన్ విచారణకు రావాల్సిందేనని ఆదేశిస్తే.. సందేహం లేదు. ఏది ఏమైనా దేశ అత్యున్నత న్యాయస్థానం సీబీఐకి నోటీసులు జారీ చేసింది.

## మళ్లీ ఇసుక వ్యవహారం

విజయవాడ, నవంబర్ 4,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జలకు రామకృష్ణారెడ్డికి సాంబార్ అన్నం మీద ఉన్న శ్రద్ధ సబ్జెక్ట్ పై ఉండదని, తానే అపర మేధావినన్నట్టు అడ్డగోలుగా మాట్లాడటం తప్ప ఆయన మాటల్లో అసలు విషయం ఉండదని టీడీపీ నేత, మాజీ మంత్రి కె. ఎస్ జవహర్ అన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పిచ్చి ముదిరి టీడీపీ అధినేత చంద్రబాబుపై రోజుకొక అక్రమ కేసు పెడుతున్నారంటూ మండిపడ్డారు. 'ఇసుకపై రూ. 40 వేల కోట్లు దోపిడి చేసిన జగన్ రెడ్డి.. మాజీ సీఎం చంద్రబాబు పై అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటు. సామాజిక న్యాయం అంటూ సంకలు గుద్దుకుంటూ.. దళిత మహిళా నేతపై అక్రమ కేసు పెట్టడం ఏ సామాజిక న్యాయం? ఉచిత ఇసుక రద్దు చేసి, 40 లక్షల మంది కార్మికుల్ని రోడ్డున పడేసి 160 మంది భవన నిర్మాణ కార్మికుల్ని బలిగొన్న ఘనుడు సీఎం జగన్ రెడ్డి. ఇసుకను మీరు దోచేసి ఉచితంగా ఇసుక ఇచ్చిన చంద్రబాబుపై అక్రమ కేసు సిగ్గనిపించటం లేదా? బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా ఇసుక ఇవ్వటమే చంద్రబాబు చేసిన తప్పా?' అని మాజీ మంత్రి జవహర్ ప్రశ్నించారు.టీడీపీ హయాంలో ఏపీ.ఎం.డీ.సీని నోడల్ ఏజెన్సీగా నియమించి, దానిద్వారా మహిళా సమాఖ్యలకు ఇసుక రీచ్ లు అప్పగించాలని.. తద్వారా వచ్చే లాభాలలో 25శాతం ఆదాయం మహిళాసంఘాలకు దక్కేలా చేయాలని ఆదేశిస్తూ జీవో - 94 ఇచ్చామన్నారు. ఈ డ్వాక్రా మహిళలలో అధిక శాతం బడుగు, బలహీన వర్గాలే ఉండేవారు. ఆ వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటం ఇష్టం లేకనే నాడు ప్రతిపక్షనేతగా జగన్, వైసీపీ నేతలు ఇసుక లో అవినీతి అంటూ తప్పుడు ప్రచారం చేశారన్నారు. వైసీపీ నేతలు పదేపదే పనిగట్టుకొని మరీ నిరాధార ఆరోపణలు ఇసుక తవ్వకాలపై చేస్తుండటంతో ఉచితంగా ప్రజలకు ఇసుక అందించామని చెప్పారు. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదు. చంద్రబాబు హయాంలో ఇసుకతవ్వకాలపై ఎన్జీటీ జరిమానా విధించిందని వైసీపీ చెబుతోంది. కానీ ఎన్జీటీ తుదితీర్పులో తాము గతంలో నియమించిన ఎక్స్ పర్ట్ కమిటీ ఇచ్చిన నివేదికతో పూర్తిగా సంతృప్తి చెందాం. అదనంగా ఎలాంటి నివేదికలు ఇవ్వాల్సిన పనిలేదని అభిప్రాయ పడుతూ.. ఎక్స్ పర్ట్ కమిటీ చాలా స్పష్టంగా ఇసుక తవ్వకాల వల్ల పర్యావర ణానికి ఎటువంటి నష్టం జరగలేదని ఎన్జీటీ పేర్కొంది. ఈ విషయాన్ని వైసీపీ నేతలు ఎందుకు చెప్పటం లేదు? అని ప్రశ్రించారు. వచ్చే ఎన్నికల్లో నిజాయితీగా గెలిచే సత్తా లేకనే సీఎం జగన్, ఏపీ మంత్రులు కుట్ర రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. ఈ కుట్ర రాజకీయాల్ని ప్రజలు చిత్తు చేసి వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి

**డాక్టర్ల నిర్లక్ష్యమని బంధువుల ఆరోపణ**

ఏలూరు,ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి నవజాత శిశువు మృతి చెందిదని బాధిత కుటుంబికులు ఆరోపించారు. నార్మల్ డెలివరీ చేస్తామంటూ పురిటి నొప్పులు పడుతున్న మహిళను వైద్యులు పట్టించుకోవడంలేదు. ప్రసవం సమయంలో శిశువు తల వద్ద గాయం కావడంతో శిశువు మృతి చెందింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని శిశువు తండ్రి రాజేష్ డిమాండ్ చేసాడు. ..

# ఏపీజేఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నిక...

- సమాజ వికాసమే పాత్రికేయల లక్ష్యం కావాలి...
- కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాగరాజు
- జర్నలిస్టుల యూనియన్ అందరికి మార్గ దర్శకం కావాలి...
- ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఎమ్మిగనూరు శాశ్వత అధ్యక్షులు కె.ఎండి.ఫరూక్ వెల్లడి...



ఎమ్మిగనూరు నవంబర్ 03 విభారె న్యూస్.సమాజ వికాసమే పాత్రికేయుల లక్ష్యం కావాలని,యూనియన్ లో ఉండే పాత్రికేయులు సమాజంలో అందరికి మార్గదర్శకం అయ్యే విదంగా విలువలతో కూడిన వార్తలు ప్రజలకు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ (ఏపీజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఎమ్మిగనూరు శాశ్వత అధ్యక్షులు కె.ఎండి.ఫరూక్,ఏపీజేఎఫ్ నాయకులు గిప్సన్, నరసప్ప లు పేర్కొన్నారు. రాష్ట్ర ఏపీజేఎఫ్ కమిటీ ఆదేశాల మేరకు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నూతన కమిటి ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ లో కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాగరాజు (వార్త క్రైం రిపోర్టర్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని, అత్యుత్తమ ప్రజాస్వామ్య దేశంగా కొనసాగాలంటే మీడియా పాత్ర కీలకమని తెలిపారు. అయితే సమాజంలో విలువల పతన ప్రభావం జర్నలిస్ట్ వృత్తిపై కూడా పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దిగజారుతున్న విలువలపై ప్రతి పాత్రికేయుడు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. పాత్రికేయులు తమను తాము సరిచేసుకోవడంతో పాటు ఆత్మవిమర్శ చేసుకుంటూ ఇతరులను మంచి మార్గంలో నడిచేలా చేయాలని కోరారు.ఈ నేపథ్యంలో విలువల పరిరక్షణ పై జర్నలిస్ట్ యూనియన్ నాయకులు,సీనియర్ పాత్రికేయులు నడుం బిగించాలని సూచించారు. ప్రజలకు ఉన్న స్వేచ్ఛ కంటే జర్నలిస్టులకు అతీతమైన స్వేచ్ఛ లేదని,ప్రజల స్వేచ్ఛపై దాడి జరుగుతుంటే వెలుగులోకి తీసుకురాకపోతే జర్నలిస్టుల స్వేచ్ఛకు కూడా భంగం కలుగుతున్నట్లేనని పేర్కొన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరి స్వేచ్ఛను కాపాడినప్పుడే జర్నలిస్టులు తమను తాము కాపాడుకోవడంతో పాటు సమాజాన్ని కాపాడిన వారు అవుతారన్నారు.ఒక సమాచారాన్ని సమాజానికి అందిస్తున్నారంటే వాస్తవాలతో కూడినదిగా ఉండాలన్నారు.నిజాన్ని నిక్కచ్చిగా రాసినప్పుడే మానవ సమాజమంతా అండగా ఉంటుందని, సమాజంలో మీకు ఒకింత గౌరవం కూడా లభిస్తుందన్నారు. రాజ్యాంగంలోని ప్రధానమైన నాలుగు వ్యవస్థల్లో మూడు వ్యవస్థలపై ప్రజలకు సరైన అభిప్రాయం,నమ్మకలేదని, ఒక్క జర్నలిజం పైనే ప్రజలకు ఇంకా విశ్వాసం ఉన్నందున నాలుగవ స్తంభమైన జర్నలిజం వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని పేర్కొన్నారు. ఉదయం లేవగానే ప్రతి ఒక్కరూ పత్రికలను చదవనిదే మిగితా కార్యకలాపాలను కొనసాగించలేరంటే సమాచారాన్ని అందించే పత్రికలు, పాత్రికేయులపై ప్రజలకున్న గౌరవానికి నిదర్శనమన్నారు. ఇన్వెస్టిగేషన్, అవినీతి వార్తలను రాసే ముందు మీ వద్ద ఆధారాలు ఉన్నా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు లేదా సంస్థల వివరణను తప్పనిసరిగా తీసుకొని మీరు రాసే వార్తకు జోడించాలని సూచించారు. వివరణతో వార్త రాయడం వల్ల న్యాయపరమైన చిక్కుల నుండి బయటపడవచ్చని తెలిపారు.ఇక చట్టాల అమలు కోసం,సమాజంలో అవినీతిని వార్తల ద్వారా తెలియజేసే పాత్రికేయులు తమ విషయంలో అమలుకు నోచుకోని చట్టాలపై నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఏపీజేఎఫ్ నాయకులు రహమాన్, జిలాన్, రాజేష్, కురవ నాగరాజు, సైఫుల్లా, శంకర్, రాజు, విజయ్, రాజశేఖర్, ప్రసాద్, పార్థు, జావీద్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దకడబూరు మండలానికి రెగ్యులర్ ఏఈ నియమించాలి సిపిఐ.డిమాండ్



పెద్దకడుబూరు నవంబర్ 04 ( విభారె న్యూస్) పెద్దకడుబూరు మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఇవ్వడం జరిగిందిఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ పెద్దకడబూర్ మండలంలో చాలా రోజులు కావస్తున్నా ఇంతవరకు మండల విద్యుత్ ఏఈ ఎవరనే విషయం అర్థం కాకఉందిఇన్చార్జి గామంత్రాలయం ఏఈ గోవింద్ ను నియమించడం జరిగింది ఆయన ఇంతవరకు కూడా ఎప్పుడు మండలానికి వస్తాడు తెలియదు ప్రజలు మాత్రం సమస్యల కోసం తిరిగిన ఆయన ఎక్కడుంటాడో తెలియని పరిస్థితి రైతులు ఎన్నోసార్లు పగలుపూట విద్యుత్తు కావాలని ఎన్నోసార్లు ఉద్యమాలు చేపట్టిన కూడా ప్రభుత్వం స్పందించలేదంటే దానికి కారణం మండలంలో ఏఈ గోవిందు సార్ పని తీరుసరిగ్గా లేదని రైతుల వాపోతున్నారు వెంటనేప్రభుత్వం రెగ్యులర్ ఏఈ ని నియ మించాలని రైతులకు పగటిపూట కరెంటు ఇవ్వాలని లేనియెడల భారతకమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో దశలవారు ఉద్యమానికిశ్రీకారం చుడతామని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం

## ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపు





పెద్దకడుబూరు నవంబరు 04 ( విభారె న్యూస్) పెద్దకడుబూరు మండంలో ఓటరు నమోదుకు సంబంధించి పెద్దకడబూరులో ప్రత్యేక క్యాంప్ జరిగింది. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదులో పాల్గొన్నారు. ఇందులో యూనిట్ ఇంచార్జ్ తలారి అంజి, బూత్ కన్వీనర్స్ బోగ్గుల నరసన్న, క్రాంతి కుమార్, మల్లికార్జున, సిద్దార్థ్ చిన్నతుంబళం గ్రామంలో ఓటరు నమోదు ప్రత్యేక క్యాంప్ జరిగింది. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో బీఎల్వోలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో యూనిట్ ఇంచార్జ్ వీరేష్ గౌడ్, బూత్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## అష్టమి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి అనగాష్టమి వ్రతం.

కర్నూలు జిల్లా ప్రతినిధి నవంబర్ 4 విభారె న్యూస్.శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు అష్టమి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి వ్రతం నిర్వహించబడును. ఈ వ్రతం చేసుకోవడం వల్ల గురు బలం పెరుగుతుంది ఉద్యోగము,వివాహము లో ఆటంకాలు తొలుగుతాయి,విద్య బుద్ధులు కలుగుతాయి, వైవాహిక జీవితంలో సమస్యలు తొలగిపోవడానికి,సకల కష్టాల నుండి విముక్తి పొంది స్వామి వారి అనుగ్రహం కలుగుతుంది. అలాగే శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి దత్త ఫలం భక్తాదులు కట్టుకొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహమును పొందగలరని కోరుకుంటున్నాము.అనఘాష్టమి వ్రతం ప్రధానముగా -1116/-సామూహికంగా -300/-సంకల్పం -116/-వివరములకు సంప్రదించగలరు.79952020828985806794దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్:8896123777



## నీటి కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి : బోజ్జా దశరథరామిరెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 04:కృష్ణా జలాల పునఃపంపిణీ పై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చీకటి చట్టం - ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు, ప్రస్తుత కరువు పరిస్థితులపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేసి కెనాల్, ఎస్ ఆర్ బి సి, ఎల్ఎల్ సి, హెచ్ ఎల్ సి, లకు ఉన్న నీటి హక్కులలో కోత విధించి, ఆ నీటిని తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించే వెసలుబాటును కలిగిస్తూ ఈ చీకటి చట్టం తెచ్చినా పాలకులలో చలనం లేకపోవడాన్ని బొజ్జా తీవ్రంగా విమర్శించారు. పోలవరం నిర్మాణం ద్వారా కృష్ణా జలాలు ఆదా అయ్యి రాయలసీమకు లబ్ది జరగడం అటుంచి, ఈ చీకటి చట్టంతో రాయలసీమకున్న నీటి హక్కులలో మరో 6.5 టిఎంసి ల కోతపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం రద్దు దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉద్యమం చేయడానికి రైతులు, విద్యార్థులు, మహిళలు, ప్రజలు సిద్ధం కావాలని బొజ్జా పిలుపునిచ్చారు. .సిపిఐ పార్టీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన నోటిఫికేషన్ ద్వారా బిజేపి తెలంగాణ ఎన్నికలలో లబ్ది పొందడానికి, ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను తాకట్టు పెట్టిందని తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి తన రాజకీయ లబ్ధికోసం మౌనంగా ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ సాగునీటి హక్కులను కాపాడటానికి కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఈ చట్టంను రద్దు చేయడానికి విజయవాడ కేంద్రంగా 30 గంటల దీక్ష నవంబర్ 14, 15 చేపట్టామని, ఈ దీక్షలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు మాట్లాడుతూ . తక్షణమే రాష్ట్రంలో కరువుతో అల్లాడుతున్న నాలుగు వందల పై చిలుకు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ నాయకులు రంగనాయకులు, రంగం ముని నాయుడు, బాబ ఫక్రుద్దీన్, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏర్వ రామచంద్రా రెడ్డి, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, పౌరసంబంధాల కార్యదర్శి సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మనసున్న మారాజును కలసిన గాయకుడు సోగనూరు ఆనంద్..



ఎమ్మిగనూరు నవంబర్ 4 విభారె న్యూస్.కర్నూలు జిల్లా రైతుల కష్టాల గురించి, వలసల గురించి పాటను రచించి స్వయంగా పాటను పాడిన ఎమ్మిగనూరు మండలం సోగనూరు కుర్రాడు ఆనంద్ ఈరోజు సామాజికవేత్త డాక్టర్.మల్లెల ఆల్ ఫ్రేడ్ రాజుని వారి నివాసంలోకలిశారు .రాబోయేరోజుల్లో నిరుద్యోగుల గురించి మహిళ లపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి పాటను రచించి పాడబోతున్నట్లుఆనంద్ తెలిపారు.ఈసందర్భంగా ఆల్ ఫ్రేడ్ రాజు మాట్లాడుతూ భవిష్యత్తులో సమాజంలో జరుగుతున్న అవినీతి మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు గురించి ఉద్యమ ఆవశ్యకతలగురించి పాటను రచించి పాడి ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలని ఆనంద్ ను కోరారు. భవిష్యత్తులో పాడే పాటలకు తన వంతుసహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అజిత్ పాల్గొన్నారు..

## నేషనల్ ఒకేషనల్ జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోండి



ఎమ్మిగనూరు నవంబర్ 03 విభారె న్యూస్.ఎమ్మిగనూరులో ఎలాంటి పర్మిషన్ లేకుండా కాలేజీని నడుపుతున్న నేషనల్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్ఎస్ఐఓకు వినతిపత్రం సమర్పించారు. కర్నూలులో నేషనల్ ఒకేషనల్ కాలేజీ పేరుతో పర్మిషన్ తీసుకొని ఎమ్మిగనూరులో కాలేజీ పేరుతో నడుపుతూ.. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని అన్నారు.

## అందరి సహకారంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతం డాక్టర్ అంకిరెడ్డి హెల్త్ ఆఫీసర్:



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 04- నంద్యాల పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని అందరి సహకారంతో విజయవంతం అయిందని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని విజయ వంతం చేసిన స్పెషలిస్ట్ డాక్టర్ల కు. మరియు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులకు సిబ్బందికి. సచివాలయ హెల్త్ సెక్రటరీలకు. ఆశా వర్కర్ల కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కౌన్సిలర్లు. వాలింటర్స్ తమ తమ వార్డులో ఉన్న పేదవారిని క్యాంపులకు చేర వేశారని వారిని ఎన్నటికి మరువలేమన్నారు. పట్టణంలో మొత్తం 33 క్యాంపుల యందు . 19.040 మంది వైద్యం చేయించుకున్నట్లు పేర్కొన్నారు . శనివారం పట్టణంలోని ఆత్మకూరుబస్టాండ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 9 వార్డు నడిగడ్డ వాసులకు వైద్య పరీక్షలు చేశారు . మొత్తం 686 మందికి వైద్య సేవలందించామని డాక్టర్ అంకి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. స్పెషలిస్ట్ డాక్టర్లు. సచివాలయ హెల్త్ సెక్రటరీలు. ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు అనంత విద్యార్థి ఎంపిక


ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 04 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని అనంత జూనియర్ కళాశాల విద్యార్థిని బి జయశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయిందని అనంత విద్యాసంస్థల అధినేత అనంతరం రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 26 వ తేదీన నంద్యాల జిల్లా ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్ 17 విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి మా కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి, చైర్మన్ విజయలక్ష్మి విద్యార్థిని జయశ్రీ ని అభినందించారు. ఈనెల నవంబర్ 7, 8 ,9 తేదీలలో విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ సాధించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థి విజయానికి కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణ ను అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో అనంత రామ సుబ్బారెడ్డి

## రవి పుష్యమి యోగం సందర్భంగా శ్రీ సూర్య మహా యజ్ఞం.

కర్నూలు నవంబర్ 03 విభారె న్యూస్.శ్రీ సూర్య మహాయజ్ఞం పుష్యమి నక్షత్రంతో కూడినటువంటి ఆదివారము ను రవి పుష్య యోగము అని పిలుస్తారు. ఇటువంటి సమయం సూర్యారాధనకు ఎంతో విశేషప్రదమైనడి. ఈ రవి పుష్య యోగ కాలము నందు కృష్ణ యజుర్వేదము నందు చెప్పబడిన అరుణ మంత్రముల చేత సంపూర్ణ ఆరోగ్యము కొరకు అరుణ హోమము నిర్వహించడం జరుగుతుంది.గమనిక: భక్తాదులు ఈ సూర్య మహా యజ్ఞ సదావకాశమును సద్వినియోగం చేసుకొని శ్రీ సూర్య భగవానుని ఆశీస్సులు పొందగలరు.ఆదివారము రవిపుష్య యోగమునందు జరుగు శ్రీ సూర్య మహాయజ్ఞ రుసుము -1116. దూర ప్రాంతాల వారు రాలేని వారు యజ్ఞ రుసుము చెల్లించినచో వారి గోత్రనామాలతో యజ్ఞము జరుపబడును.శ్రీ సూర్య మహాయజ్ఞమునందు భక్తాదులు సహకరించి ఉదయం 10:30 గంటలకు మన కర్నూలు సూర్యదేవాలయమునకు విచ్చేసి శ్రీ సూర్య మహాయజ్ఞ సంకల్పం నందు పాల్గొని మహా పూర్ణాహుతిని యజ్ఞమునందు సమర్పణ చేసుకోగలరు.ముఖ్య వివరములకు సంప్రదించగలరు:8919495919,898580 6794.దేవాలయం ఫోన్పేగూగుల్ పే నెంబరు:8896123777



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**